'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

## నమస్తే తెలంగాణ

# అధికారుల ప్రచారమా?

**కేంద్రంలోని** మోదీ ప్రభుత్వం ఈడీ, సీబీఐ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవడం తెలిసిందే. అవతలి పార్టీ వాళ్లు, అందులోనూ తమ మాట విననివారిపై దాడులు జరుపుతున్నది. దాడులకు భయపడి తమవైపు తిరిగితే వారిపై ఏ మచ్చా ఉండదు. 'నోరు మూసుకోకపోతే మీ ఇంటికి ఈడీ వస్తుందని' విపక్ష సభ్యులను ఓ బీజేపీ ఎంపీ బాహాటంగా హెచ్చరించిన సంగతి విదితమే. మరోవైపు 'బీజేపీలో చేరాను నాకు ఇక దాడుల భయం ఉండదని' గోడదూకిన ఓ విపక్ష నేత అనడమూ తెలుసు. ఇది ఇప్పటిదాకా జరిగిన తతంగం. ఇప్పుడు పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తున్నకొద్దీ ఓటమి భయంతో బీజేపీ సర్కారు వికృత చేష్టలకు తెగిస్తున్నది. హడావుడిగా గ్యాస్ సిలిండర్ ధరలు తగ్గించడం వంటి తాయిలాల మాట సరేసరి. ఇప్పుడు ఏకంగా ప్రభుత్వ యంత్రాంగాన్నే ప్రచారానికి వినియోగించుకునేందుకు ఒడిగట్టింది. ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరించడానికి అధికారులను దేశమంతటా రథ ప్రభారీలుగా అంటే ప్రచార ఇంచార్జీలుగా కేంద్రం నియమించింది. వారు జిల్లాల్లో కేంద్రం గత తొమ్మిదేండ్ల పాలనలో సాధించిన విజయాలంటూ ప్రచారం సాగిస్తారు. ఎన్నికలు దగ్గర పడుతున్నప్పుడు ప్రభుత్వాలు కార్యక్రమాలను ప్రచారం చేసుకుంటూ ప్రకటనలు విడుదల చేయడం సాధారణమే. వాజపేయి ప్రధానిగా ఉన్నప్పుడు 'భారత్ వెలిగిపోతోందంటూ' బీజేపీ నేతృత్వంలోని అప్పటి కేంద్ర సర్కారు పెద్దఎత్తున మీడియాలో ప్రచారోద్యమం నిర్వహించింది. కానీ, ఆ ఎన్నికల్లో ఓటమి చవిచూడటం గమనార్హం. ఇప్పుడు మోదీ సర్కారు ఒకడుగు ముందుకు వేసి ప్రభుత్వ యంత్రాంగాన్ని వాడుకునేందుకు తెగించింది.

నవంబర్ 25 నుంచి వచ్చే జనవరి 25 వరకు 'వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర' జరుగుతుందని, దేశంలోని మొత్తం 765 జిల్లాల్లో ఆ ప్రచార యాత్ర పర్యవేక్షణకు అధికారులను కేటాయించాలని కేంద్రం గత 17న జారీచేసిన సర్క్యులర్‌పై రాజకీయ దుమారం చెలరేగుతున్నది. రథప్రభారీలు, అంటే స్పెషల్ ఆఫీసర్లు కేంద్ర ప్రభుత్వం తరఫున ప్రచార బాకాలూదాలనేది దాని సారాంశం. ఇది ఎన్నికల అవసరాలకు అధికార యంత్రాంగాన్ని దుర్వినియోగపర్చడం తప్ప మరోటి కాదని, సర్క్యులర్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని విపక్షాలు డిమాండ్ చేశాయి. ఎన్నికల సంఘానికి లేఖలూ రాశాయి. ఆదర్శ ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిన తర్వాత జారీచేసిన ఈ సర్క్యులర్ చెల్లదని మాజీ ఐఏఎస్ అధికారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

మోదీ సర్కారు తొమ్మిదేండ్ల విజయాలను పక్కనపెడితే అపజయాలను ప్రజలకు ఎవరూ వివరించాల్సిన అవసరం లేదు. ధరల పెరుగుదల, నోట్లరద్దు, ఉపాధి కల్పనలో తీవ్ర వైఫల్యం, జీఎస్టీ బాదుడు, వ్యవసాయ నల్లచట్టాలు, మహిళలపై అత్యాచారాలు, ప్రజల మధ్య చీలికలు తెచ్చి మతోన్మాదానికి ఆజ్యం పోయడం వంటి మోదీ పాలన ఫలితాలను ప్రజలు అనుభవపూర్వకంగా తెలుసుకున్నారు. ఇది పసిగట్టిన కేంద్రం ప్రచార హోరు పెంచాలని చూస్తున్నది. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచారానికి సైన్యాన్ని కూడా వాడుకోవడానికి తెగబడటం ఈ ధోరణికి పరాకాష్ఠ. దీర్ఘకాలికంగా దేశంపై ప్రభావం చూపే ఇలాంటి అడ్డూ అదుపూ లేని చర్యలకు దిగజారడాన్ని ప్రజలు గమనిస్తూనే ఉన్నారు. నిఖార్సయిన పనిమంతులెవరో, ఉత్తుత్తి ప్రచారంతో వ్యక్తిపూజా దురాచారానికి పాల్పడేదెవరో వారికి తెలుసు. సకాలంలో సరైన తీర్పు వెలువరించి నిగ్గుతేల్చేది ప్రజలే.

# గోస తీరింది.. బతుకు మారింది

**సత్యాన్ని చూడగలిగేవారికైనా, సర్వే శాస్త్రీయంగా చేసేవారెవ్వరికైనా స్పష్టంగా వెల్లడయ్యే వాస్తవం ఏమంటే మళ్లీ బీఆర్‌ఎస్‌దే బ్రహ్మాండమైన విజయం అని. నీటిలో చేపలా ప్రజల మధ్యలో కలియదిరిగే అవకాశం దొరికిన ప్రతి సందర్భంలోనూ ఎన్నో కొత్త విషయాలు నేర్చుకునే వెసులుబాటు కలుగుతుంది. అందునా జీవితాలను, ఆయా ప్రాంతాల్లోని భౌతిక పరిస్థితులను స్వీయ రాజకీయ దృష్టికోణంతో కాకుండా, ప్రజా జీవన విధానం నుంచి అధ్యయనం చేయగలిగేవారికి అనేక అంశాలు బోధపడుతాయి.**



డాక్టర్ ఆంజనేయ గౌడ్
98853 52242

2023 శాసనసభ ఎన్నికల సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశానుసారం మక్తల్ నియోజకవర్గ ఎన్నికల ఇంఛార్జ్‌గా వారం రోజుల పాటు అక్కడి గ్రామాల్లో కలియదిరిగిన తర్వాత ఎంతో విలువైన అనుభూతిని జ్ఞాపకాల్లో నమోదు చేసుకునే అవకాశం కలిగింది. మొన్న మాగనూర్ మండల బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం ముగిసిన తర్వాత గట్టి పప్పు, గడ్డిపూల తొక్కు, అక్కడి ప్రత్యేకమైన చింతకాయ తొక్కు, గుమగుమలాడే వంకాయ కూర, గట్టి ఇంటి పెరుగుతో భోజనం ఏర్పాటుచేసి కొత్తపల్లి అనే పల్లెటూరుకు వెంకట్‌రెడ్డి అనే రైతు ఆహ్వానించాడు. భోజనం మధ్యలో మాటలు కలిపి వడ్డిస్తూ.. 'నాడు ఏముండే అన్న, పట్టుమని పదివేలు కూడా ఊళ్లె పుట్టకపోయేది, రాయచూరు గంజి (వ్యవసాయ మార్కెట్)ల సావుకార్ల చుట్టూ దినాలకు దినాలు అప్పు కోసం తిరిగేది. పంట పెట్టాలన్న, పెళ్లి చేసి పంపిన ఆడబిడ్డ కుటుంబాన్ని పండుగ నాడు ఇంటికి పిలవాలన్న గుండెలు పగిలినంత పనయ్యేది. కానీ కరెంటు, రైతుబంధు, మా దగ్గర భీమా పెండింగ్ పనుల పూర్తివల్ల పంటలు పండటమే కాదు, ధైర్యం పెరిగి, జనాలు పది పనులు ఎక్కువ చేసుకొని పైసలు కూడబెట్టుకుంటున్నరు. కేసీఆర్ రైతులకు ఇచ్చింది పెట్టుబడి మాత్రమే కాదు, గుండెల నిండా ధైర్యాన్నీ, ఆ సారే మనకుండాలన్నా..' అని చెప్తుంటే అందరి కండ్లల్లో నీళ్లు తిరిగాయి. ఆ ఇంటినుంచి బయటకొస్తూ గమనిస్తే, ఒక గదిలో నిండా పేర్చిన పత్తి పంట రాశి, వ్యవసాయ పనిముట్లు మమ్మల్ని మరో గంటసేపు నిలబెట్టి వ్యవసాయం చుట్టూ తిప్పాయి. ఎంత గొప్పగా వివరిస్తున్నారు వాళ్లు? వచ్చిన మార్పును, పదేండ్ల ప్రగతి పంటను గుమిగూడిన గుంపులోనుంచి ఒక్కక్కరూ విడమరిచి చెప్తుంటే నేను, ఆ నియోజకవర్గ అభ్యర్థి చిట్టెం రాంమ్మోహన్‌రెడ్డి, మాతో పాటు ఉన్న పాత్రికేయ మిత్రులందరం ఆశ్చర్యంతో వింటూ ఉండిపోయాం.

ప్రజలు ఒక స్థిరమైన అభిప్రాయాన్ని, ఆమాటకొస్తే ఏ అభిప్రాయాన్నైనా గాలివాటం దృక్పథంతో ఏర్పరుచుకోరు. నిత్యం పంటపొలాల్లో, చేసే ప్రతి పనిలో శారీరక, మానసిక సంఘర్షణతో పాటు ఆలోచనల వాదోపవాదాలు ఏడాది పొడవునా కొనసాగుతుంటాయి. నూరు పూలు వికసించనీ, వెయ్యి ఆలోచనలు సంఘర్షించనీ అనే తత్వం సహజాతి సహజంగా గ్రామాల్లో ఉంటుంది. అయితే ఏ అంతిమ జన నిశ్చితాభిప్రాయానికైనా పునాది పేర్చేది వారి అనుభవమే కానీ, ఎవరో రుద్దితే రగిలేది కానే కాదనే వాస్తవం తెలంగాణ పల్లెల్లో గడిపితే తేలిగ్గా అవగతమైపోతుంది. కృష్ణా నదికి కూతవేటు దూరంలో, జూరాల ప్రాజెక్టుకు దగ్గరగా ఉన్న ఆత్మకూరు మండలంలోని రేచింతల గ్రామంలో, పొలంలో పనిచేస్తున్న ఇరువై మంది మహిళా రైతులతో ముచ్చట్ల సందర్భంగా.. 'పొలాలకు నీళ్ల సంగతి కాడికిపోయినవ్ బిడ్డా, తాగేతందుకు నాలుగు బిందెల నీళ్లకు పదేండ్ల కిందట ఎంతో గోస పడేది. బోరింగుల కాడ గాజులు, బిందెలు పగిలేది. ఎంతోమంది ఊరోళ్లం బోరింగుల వద్ద పంచాయతీ పెట్టుకొని ఏండ్లకేండ్లు మాట్లాడుకోకపోయేటిది. తాగునీటి కోసం ఊరు విడిపోయేది, ఇప్పుడు ఇంటింటికీ నల్లా నీళ్లిచ్చి కేసీఆర్ ఎంత పుణ్యం కట్టుకున్నడో ఎరుకేనా' అని వాళ్లు పోటీ పడుతూ గలగలా మాట్లాడుతుంటే గుండెలను మెలిపెట్టినట్టయింది.

> దప్పిక తీర్చుకోవడానికి తెలంగాణ తల్లులు నిత్యం ఒకరినొకరు తన్నుకు చచ్చిన నిన్నటి దుస్థితిని, నేటి మిషన్ భగీరథ నల్లా నీటిని గుర్తుచేసుకొని ఆ మహిళలు ఎంత భావోద్వేగానికి గురయ్యారో వర్ణించలేం. పల్లెవాసులదీ కల్లాకపటమెరుగని పసిపిల్లల తీరు, మేలుచేసిన వారిని ఆరాధించడంలో వారందరికీ ఆకాశమే హద్దు. ఇప్పుడు కేసీఆర్ అంటే అభిమానమే కాదు, వారికి ఆరాధ్య దీపం కూడా.




నర్వ మండలం లక్కర్‌దొడ్డి గ్రామానికి చెందిన యువకులతో ఛాయ్ దుకాణం దగ్గర మాటకలిపితే, అందులో ఎంఏ ఇంగ్లీష్ చేసి, బీసీ స్టడీ సర్కిల్‌లో అధ్యాపకుడిగా బోధిస్తున్న రాఘవేందర్.. 'సీఎం అప్పులు చేసిండని వాగే విపక్షాలు పెరిగిన ఆస్తులు, సౌకర్యాలు, గ్రామాల్లో అమాంతం ఎన్నో రెట్లు పెరిగిన సంపద విలువ, అంతకుమించి అందరిలో పెరిగిన ధీమా, వీటన్నింటి విలువ ఎన్ని లక్షల కోట్లో లెక్కచెప్పగలరా? నూతన జిల్లాలు, మండలాలు, గ్రామపంచాయతీల ఏర్పాటుతో అధికార యంత్రాంగం అందరికీ అడుగు దూరంలోకి రావడమే కాదు, కొత్త కలెక్టరేట్లను చూస్తే ఎంత గర్వంగా ఉంటుందన్నా..! అయినా పక్క రాష్ర్టాల పరిస్థితులు, మన రాష్ట్రంలో పరిస్థితులు చూసి, అర్థం చేసుకున్నోడెవడైనా కేసీఆర్‌ను కాదనుకుంటరా?' అని చెప్పుకుంటూపోతున్నడు. ఎన్నో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విజయాలపై విలువైన విశ్లేషణలు చేశాడు. అదేవిధంగా దేశంలోని రాజకీయపార్టీల జెండాలన్నీ ఉండే అమరచింతలో, రమేష్, అతని కుటుంబ సభ్యులను కదిలిస్తే 'లబ్ధిదారుడు లేని గడప లేదన్నా, అంతెందుకు ఒక్క 24 గంటల కరెంట్ ఇచ్చినందుకు కేసీఆర్‌కు ఎన్నిసార్లయినా ఓటేయవచ్చు. నీళ్లు ఇచ్చిండు, ఉచిత విద్యుత్తు సరఫరా చేసే, పెట్టుబడి ఇవ్వబట్టే ఇంతకన్నా జనానికి ఏం కావాలన్నా' అంటూ ఎదురు ప్రశ్నలతో మమ్మల్నే నిలదీశారు. ఊట్కూర్ మండలంలోని పులి మామిడి, అమీన్‌పూర్, పగిడిమారి గ్రామాల్లో, మక్తల్ మండలం కర్నే, అనుగొండ, జక్లేర్ గ్రామాల్లో ఎంతో మంది ఇదే ముచ్చట్లు భట్టీ పట్టినట్టుగా గుక్క తిప్పుకోకుండా చెప్తున్నారు.

కృష్ణ మండలం కర్ణాటకలోని రాయచూరుకు ఆనుకొని ఉంటుంది. ఇక్కడి గ్రామస్థులకు పెండ్లి సంబంధాలు, చుట్టరికాలు కర్ణాటక గ్రామవాసులతో పెద్ద ఎత్తున ఉంటాయి. ఆ మండలంలోని ముడుమళ్ల గ్రామానికి చెందిన అశోక్ కర్ణాటకకు మనువిచ్చిన చెల్లెలికి ఫోన్‌చేసి ఓపెన్ స్పీకర్ పెట్టి అక్కడి కాంగ్రెస్ సర్కార్ పనితీరు అడిగినప్పుడు, కోపంతో కన్నడిగుల యాసతో తెలుగులో హస్తం పార్టీకి పెట్టిన శాపనార్థాలు విని కడుపుబ్బా నవ్వుకొన్నాం. 'రూ.800ల పింఛన్, గృహభాగ్య రూ.3 వేలు మొదటి నెల తప్ప, ఐదు నెలలైనా వేస్తనే లేరు. బడికి పిల్లలను పంపడానికే సరిపోని ఆర్టీసీ బస్సుల్లో ఉచితం అని చెప్పి, ఇప్పుడు ఊర్లలో ఏ బస్సు ఆపుతనే లేర'ని ఆక్రోశం వెళ్లగక్కింది. కాంగ్రెసోళ్లకు ఓటేస్తే పాపం తగులుతదని ఫోన్‌లో ఆ అక్క చెప్పింది సత్యమేనని అందరమనుకున్నాం. కృష్ణ గ్రామానికి చెందిన శివ్ పాటిల్, కుసుమూర్తి గ్రామ సర్పంచ్ మోనేష్ అందుకొని 'పక్కన కర్ణాటక పల్లెల్లో ఏముందప్ప? రోడ్లు సక్కగలేవు, నీళ్లు దొరకవు, కరెంటు రాదు, కాంగ్రెస్ పార్టీ వాళ్లు చెప్పింది ఒక్కటన్నా చేసింద్రా? మనకు కేసీఆర్ సార్ సీఎంగా ఉంటే ఏ చింత అవసరమే లేదు, అందరినీ ఆయనే చూసుకుంటాడు' అని అంటుంటే ఇంతలా అన్ని వర్గాల్లో భరోసా కల్పించిన పాలకుడెవరూ ఉండరేమో అనిపించింది. ప్రజల భావనలతో కలిసిపోయే పనితీరు, వారి ఆకాంక్షల వెలుగులో కార్యాచరణను అమలుచేసే బీఆర్‌ఎస్ పార్టీ ప్రజలందరి ఉమ్మడి రాజకీయ విశ్వాసంగా మారిపోయింది. అందుకే 'మిషన్ చాణక్య' 110 నియోజకవర్గాల్లో 6,500 మంది ఉద్యోగులతో దాదాపు 14 లక్షల మంది నుంచి సేకరించిన అభిప్రాయంలో మళ్లీ బీఆర్‌ఎస్‌దే అధికారమనే వాస్తవం వెల్లడైంది. 'మిషన్ చాణక్య'నే కాదు, ఏ సర్వే ఏజెన్సీ ప్రజా నాడికోసం జల్లెడ పట్టినా, గులాబీపార్టీదే ఘన విజయం అనే నిజం వెల్లడవుతున్నది.

మక్తల్ మనస్సులో అయినా, తెలంగాణ గ్రామాలన్నింటి గుండెల్లోనైనా కొలువై ఉన్నది కేసీఆరే అన్నది జగమెరిగిన సత్యం. నాడు దేవుని పాత్రల్లో నటించి రాజకీయాల్లో అడుగుపెట్టిన ఎన్టీఆర్‌కే అఖండ విజయం ఇచ్చి ఆశీర్వదించారు. అలాంటిది రాష్ట్రం కోసం యములోడికీ ఎదురెళ్లి, స్వయం పాలనలో సకలజనుల సంక్షేమం కోసం శ్రామికుడిగా సర్వశక్తులు ఒడ్డుతున్న సీఎం కేసీఆర్‌కు కొండంత అండగా ఉండకుండా రాష్ట్ర ప్రజారాశులు ఉండగలరా?

> అందరికీ మేలు జరుగుతుందంటే, ఊపిరే అర్పించడానికి వెరువని మన సమాజం, తెలంగాణను గర్వపడేలా తీర్చిదిద్దిన కేసీఆర్‌ను ఓట్లతో ఆశీర్వదించకుండా ఉండగలదా? నేడు తెలంగాణ మూలమూలనా 'కేసీఆర్ జిందాబాద్' అనే నినాదమే నిటారుగా నిలబడ్డది. అప్పుడప్పుడు కేసీఆర్ చెప్తున్నట్టుగా ప్రజలు తమ జేబులోని రూపాయిని రోడ్డు మీద పారేసుకోరు. కష్టజీవులకు నిర్మాణం విలువ తెలుసు.

భూమి దప్పిక, విత్తనం నొప్పులు తెలిసిన వారికి, పంటకోసం రేయింబవళ్లూ కొవ్వొత్తులుగా మారే రైతు లోకానికి, ఇప్పుడు తమ పంటపై నిండు పున్నమి లాంటి చంద్రుడు కేసీఆర్. సుఖశాంతుల తెలంగాణ సుభిక్షంగా వర్ధిల్లాలంటే మళ్లీ కేసీఆర్ సర్కారే రావాలని కుటుంబాలన్నీ కూడబలుక్కొని ఉన్నాయి. నవంబర్ 30న పోలింగ్ కేంద్రాల్లో ఓట్ల రాశి ధారగా కురిసేది గులాబీ పార్టీ ఒడిలోనే. చరిత్ర తొవ్వలో ఎన్నో గండాల నుంచి గట్టెక్కిన మన తెలంగాణ ఎప్పుడూ చెడును కోరి తగిలించుకోదు.

(వ్యాసకర్త: రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్)

# ఎద్దు నవ్వింది.. ఎవుసం పండుగైంది

**తెలంగాణ రాకముందు కూడా నీళ్లుండేవి. కాకపోతే ఆ నీళ్లు రైతు కండ్లల్లో మాత్రమే ఉండేవి. తెలంగాణ రాకముందు కూడా చెట్లుండేవి. కాకపోతే, ఆ చెట్లకు పండ్ల కంటే ఎక్కువగా ఉరితాళ్లే మొలిచేవి. డెబ్బై శాతానికి పైగా జీవనదులు పారే నేలలో.. డెబ్బై శాతం మంది ఆధారపడి బతికే వ్యవసాయం విధ్వంసంగా ఎందుకు మారింది? వ్యవసాయాన్ని దండుగగా మార్చేసిన సమైక్య దౌర్భాగ్యం నుంచి వ్యవసాయాన్ని పండుగగా మార్చిన స్వరాష్ట్ర సౌభాగ్యంలోకి ఒక్కసారి తొంగిచూస్తే ఒక గొప్ప వ్యవసాయ విప్లవమే కనిపిస్తుంది.**



ఇంగ్లీష్ రమేష్
90630 92644

నాటి పరాయి పాలనలో తన పంటకు పట్టిన చీడ పురుగు లెక్కనే ఉండేది రైతు పరిస్థితి. ఆ చీడ పురుగులు తినటానికి కనీసం ఆ పంటైనా ఉండేది. కానీ, రైతుకు మాత్రం ఆ పురుగుల కోసం తెచ్చిన మందుడబ్బాలే గతి అయ్యేవి. పొలాలల్లో నీళ్లకంటే రైతులు తాగిపడేసిన మందు డబ్బాలే ఎక్కువగా కనిపించేవి. వర్షం మోసం చేసేది, విత్తనం మోసం చేసేది, ఆఖరికి పంట కూడా మోసం చేసేది. పంట కోసం చేసిన అప్పులన్నీ పండించిన పంటలను పురుగుల కంటే దారుణంగా తినేస్తున్న దుస్థితిలో నాగలి సైతం అలిసిపోయింది, వ్యవసాయం నరకమైంది. అర్ధరాత్రి ఎప్పుడొస్తదో తెల్వని కరెంట్ కోసం, పాములకు, తేళ్లకు బలైపోయిన జీవితాల నుంచీ, అప్పులకూ, వడ్డీలకూ నలిగిపోయిన రైతు చరిత్ర ప్రతీ ఎకరంలో కనిపిస్తుండేది. ఒక్కో ఎకరంలో నాటిన విత్తనాల కంటే ఆ పంటకు నీళ్లివ్వటం కోసం వేసిన బోర్లే ఎక్కువుండేవి. బోర్లల్లో నీళ్ల కోసం చూసీచూసీ రైతుల కండ్లల్లో కూడా నీళ్లింకిపోయాయి. ఈ దరిద్రాలు చాలవన్నట్టు నీళ్లివ్వటం చేతకాని ప్రభుత్వాలే కరెంటు బిల్లులు పెంచటం, 'ఎందుకు పెంచుతున్నార'ని అడిగినందుకు రైతులను పిట్టల్ని కాల్చినట్టు కాల్చి చంపటం. ఇలా తెలంగాణలో వ్యవసాయాన్ని విధ్వంసం చేయటం కోసం సమైక్య పాలనలో జరిగిన దారుణాలెన్నో.

ఏ సంక్షోభాన్నైనా కూకటివేళ్లతో సహా పెకిలించినప్పుడే ఒక గొప్ప మార్పు సాధ్యమవుతుందని నమ్మిన నాయకుడే మన పాలకుడు కావటం తెలంగాణ చేసుకున్న అదృష్టం. తెలంగాణ వ్యవసాయానికి కలుపు మొక్కలుగా మారినవి నీళ్లు, కరెంటు లేకపోవటం. ముందుగాల ఆ సమస్యలను పరిష్కరించాలి. అందుకే, స్వరాష్ట్ర కల సాకారమైన వెంటనే తెలంగాణ ప్రభుత్వం మొదటగా దృష్టి పెట్టింది కరెంటు, సాగునీటి ప్రాజెక్టుల మీదనే. పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తూ భారీ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేస్తూ ప్రతీ ఎకరానికి నీళ్లివ్వాలనే లక్ష్య సాధనలో తెలంగాణ అద్భుతమైన విజయం సాధించిందనే చెప్పుకోవచ్చు



24 గంటల ఉచిత విద్యుత్తు, కాళేశ్వరం లాంటి భారీ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తిచేయటంతో పాటుగా, కాకతీయుల నుంచి వారసత్వంగా వచ్చిన చెరువుల్లో పూడికలు తీయటం వాగుల మీద ఎక్కడికక్కడ చెక్‌డ్యామ్‌లు కట్టడంతో తెలంగాణలో జల వనరులు భారీగా పెరిగాయి. భూగర్భ జలాలు అతి తక్కువకాలంలో ఇంత భారీగా పెరగటమనేది కచ్చితంగా అభినందించాల్సిన విషయమే. ఇకపోతే వ్యవసాయాన్ని నిలబెట్టాలంటే కరెంటూ, నీళ్లు మాత్రమే సరిపోవు. రైతులను అప్పుల ఊబిలోకి నెట్టేస్తున్న అన్ని సమస్యల్లోంచీ బయటపడేసినప్పుడే వారి ఆదాయం పెరుగుతుంది. అయితే రైతు అప్పులు చేసేది కేవలం పంట సాయం కోసం మాత్రమే కాదు, బిడ్డల పెండ్లిళ్ల కోసం, వాళ్ల బిడ్డల బారసాలల కోసం. పండుగల కోసం.. ఇలా చాలా సామాజిక అవసరాల కోసం రైతులు అప్పులు చేస్తుంటారు. ఈ అప్పుల వల్ల పంటలను కూడా తక్కువ ధరకే అప్పిచ్చిన వాళ్లకే అమ్ముకునే దుస్థితి ఉండేది. ఒకవైపు రైతుకు పంట సాయం చేస్తూనే మిగతా ఖర్చుల్లో అండగా నిలబడినప్పుడే ఆ రైతును అన్నిరకాలుగా నిలబెట్టడం సాధ్యమవుతుంది. అందుకే అటు రైతుబంధు, ఇటు కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్ లాంటి అద్భుతమైన పథకాలు అమలుచేస్తూ.. మరో పక్క రుణమాఫీని కూడా అమలుచేసి రైతులను అప్పుల ఊబిలోంచి బయటపడేస్తున్నారు. సంక్షేమంతో పాటు అభివృద్ధి కూడా ముఖ్యమే కాబట్టి ప్రభుత్వ దవాఖానలను అద్భుతంగా మార్చేస్తున్నారు. ప్రభుత్వ దవాఖానల్లో గణనీయంగా పెరిగిన కాన్పులే దీనికి ఉదాహరణ.

> అన్ని అరిష్టాలూ దాటుకొని పంట పండించటం ఎంత కష్టమో, ఆ పంటను సరైన ధరకు అమ్ముకోవడం కూడా అంతే కష్టం. పంట పైసలు ఎప్పుడు చేతికొస్తయో తెల్వని దరిద్రం ఉండేది. పైగా ట్రాక్టర్ల కిరాయిలు, మిల్లులు అంటూ సగం డబ్బులు అటే పోయేవి. కానీ, ఇప్పుడు స్వరాష్ట్ర పాలనలో ప్రభుత్వమే రైతుల దగ్గరికి వచ్చి పంట కొనుగోలు చేస్తున్నది. పంట డబ్బులను ప్రభుత్వమే నేరుగా రైతుల ఖాతాల్లో జమచేస్తున్నది.

సీఎం కేసీఆర్ చెప్పినట్టు ఒకప్పటిలా సేట్ల చుట్టూ, బీట్ల చుట్టూ తిరిగే అవసరం లేకుండా రైతులు సంతోషంగా తమ పంటలు అమ్ముకుంటున్నారు, సంతోషంగా ఉంటున్నారు. దురదృష్టవశాత్తూ ఇంటికి పెద్ద దిక్కయిన రైతు చనిపోతే ఆ కుటుంబం ఆగంకావొద్దు, వాళ్ల వ్యవసాయం ఆగిపోవద్దనే ఆలోచనతో దినవారం లోపే వాళ్లకు ధీమాను అందిస్తూ రైతులను, వ్యవసాయాన్నీ గుండెల్లో పెట్టుకొని కాపాడుకుంటున్న రైతుబిడ్డ కేసీఆరే అని చెప్పడంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు.

కండ్లముందే వందల కిలోమీటర్ల కాల్వలు కనిపిస్తున్నాయి. ఆ కాల్వల నిండా నీళ్లు కనిపిస్తున్నాయి. పెరిగిన సాగు కండ్లముందే ఉన్నది. పెరిగిన పంట దిగుబడి కండ్లముందే ఉన్నది. పచ్చదనం పెరిగింది, నీటి వనరులు పెరిగినయి. భూగర్భ జలాలు పెరిగినయి. తలసరి ఆదాయం పెరిగింది. రైతు ఆదాయం పెరిగింది. ఆత్మహత్యలు తగ్గిపోయినయి. అప్పులు తగ్గిపోయినయి. ఇవన్నీ ప్రతిపక్షాల కండ్లకు కనిపించటం లేదు. కానీ, ప్రజలు మాత్రం చాలా క్లారిటీగా ఉన్నరు. కరువును జూసిన అదే కండ్లతో నమ్మశక్యం కాని మార్పును తమ కండ్ల ముందే చూస్తున్న ప్రజలకు తెలంగాణ ప్రభుత్వం ఏం చేసిందో అర్థమైంది. కానీ, ప్రతిపక్షాలకే ఇంకా విషయం అర్థం కావట్లేదు. కేవలం పదేండ్లలోనే ధాన్యం దిగుబడిలో మాత్రమే కాకుండా తలసరి ఆదాయంలో కూడా నెంబర్-1గా దూసుకుపోతున్న తెలంగాణ అభివృద్ధి తమ పాలనలో ఉన్న రాష్ర్టాల్లో ఎక్కడా లేకపోవటంతో ఇక్కడి ప్రజలు తమను ఎలా నమ్ముతారనే నైరాశ్యంలో ప్రతిపక్షాలు మునిగిపోతున్నాయి.

తెలంగాణలో అద్భుతాలు చేస్తామని చెప్పుకొంటున్న ప్రతిపక్ష పాలనలో ఉన్న రాష్ర్టాల్లో ఏ ఒక్క రాష్ట్రంలోనూ కనీసం 9 గంటల కరెంటు కూడా సక్కగ ఇవ్వటం లేదు. వాళ్ల రాష్ర్టాల్లో రైతు బీమా లేదు. రైతుబంధు లేదు. కానీ, ఇక్కడ మాత్రం అద్భుతాలు చేస్తామని మాయ మాటలు చెప్తున్నారు. పెరిగిన సాగు అబద్ధమాడదు, పెరిగిన నీళ్లు అబద్ధమాడవు. పచ్చదనం అబద్ధమాడదు. రైతు కండ్లల్లో ఆనందబాష్పాలు అబద్ధం చెప్పవు. అందుకే కేసీఆర్ మీద ప్రతిపక్షాలు చేస్తున్న అబద్ధపు ప్రచారాలను ఎవ్వరూ నమ్మడం లేదు. ప్రతిపక్ష పాలనలో ఉన్న రాష్ర్టాల్లోంచి తెలంగాణ పొలాల్లో కూలీ పనుల కోసం వస్తున్న కూలీలే తెలంగాణ వ్యవసాయరంగంలో సాధించిన గొప్ప మార్పుకు నిదర్శనం. ఇది ప్రతిపక్షాలు సైతం ఒప్పుకొని తీరాల్సిన నిజం. అందుకే తెలంగాణలో ఎద్దు నవ్వింది. ఎవుసం లేసింది. రైతు నవ్విండు, రాజ్యం బాగుపడ్డది. కృష్ణమ్మను కండ్లల్లో, గోదారిని గుండెల్లో సంకల్పంగా నింపుకున్న ఒక దార్శనిక మహర్షి పట్టుదలతోనే ఒకప్పటి కరువు నేల ఇయ్యాల దేశంలోనే నెంబర్-1 స్థానంలో నిలబడింది. తెలంగాణ పాలంలో రైతులను పండిస్తున్న రైతు బిడ్డకు, తెలంగాణ నాగలి చేతులెత్తి నమస్కారం చేస్తున్నది.

**మన దేశంలో బీమా రంగం చాలా వెనుకబడి ఉన్నది. దేశ జనాభాలో 2 నుంచి 4 శాతం ప్రజలకు మాత్రమే బీమా సౌకర్యం ఉన్నదంటే ఆ రంగం పరిస్థితి ఏమిటో అర్థమవుతున్నది. ఆధునిక సమాజంలో బీమా అనేది ప్రతి వ్యక్తికి అవసరం. అధిక ప్రీమియంలు, అవగాహనా రాహిత్యం, ప్రైవేట్ బీమా కంపెనీల మోసాల కారణంగా బీమారంగం చాలా వెనుకబడి ఉన్నదని ఘంటాపథంగా చెప్పవచ్చు.**

# సకల జనులకు ధీమా



కన్నోజు శ్రీహర్ష
89851 30032



తెలంగాణ ప్రభుత్వం బీమా రంగం విషయంలో కీలకమైన విధానాలను తీసుకువచ్చింది. ఐరోపా, అమెరికాల్లో అక్కడి జనాభాలో సుమారు 80 శాతం ప్రజలకు ప్రభుత్వాలే బీమా సౌకర్యాన్ని కల్పిస్తున్నాయి. ప్రపంచ సంస్థలు, ఆక్స్‌ఫర్డ్ నివేదికైన బహుళ పేదరిక సూచి కూడా అభివృద్ధి చెందిన దేశాల్లో ప్రజలకు కావలసిన కనీస సౌకర్యాల్లో బీమాను ఒకటిగా చూపిస్తున్నది. అభివృద్ధి చెందిన దేశాలు మానవ సూచిలో ప్రతిసారి మొదటిస్థానం సంపాదించడంలో కీలకపాత్ర బీమారంగమే పోషిస్తున్నది. ఇలాంటి విధానమైన పద్ధతులను, అనేక విషయాలను పరిగణనలోకి తీసుకొని తెలంగాణ ప్రభుత్వం బీమా రంగం అభివృద్ధితో పాటు రాష్ట్ర ప్రజలకు బీమా సౌకర్యం కల్పిస్తున్నది.

తెలంగాణ ప్రభుత్వం మొదటిసారి రైతు బీమా పథకంతో ఈ రంగంలో అడుగుపెట్టింది. దేశంలో ఇప్పుడున్న కేంద్రప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థయిన ఎల్ఐసీలోని 25 శాతం వాటాను అమ్మకానికి పెట్టడానికి సిద్ధమైన తరుణంలో తెలంగాణ ప్రభుత్వం ఎల్ఐసీకే ధీమా ఇచ్చింది. రైతుబీమా ద్వారా రైతులు చెల్లించే రూ.2700 ప్రీమియంను వారి తరపున ప్రభుత్వమే నేరుగా ఎల్ఐసీ సంస్థకు చెలిస్తున్నది. దీనిద్వారా రైతులకే కాకుండా ఎల్ఐసీకి సైతం భారీగా లాభం చేకూరుతున్నది. 'గౌడలకు బీమా', 'చేనేత బీమా', 'దళిత రక్షణ నిధి' లాంటి విధానాల వల్ల తెలంగాణ ప్రజలు భారీగా బీమా సౌకర్యాన్ని పొందుతున్నారు. రాష్ట్ర జనాభాలో దాదాపు 63 లక్షల మంది లబ్ధిదారులు ప్రభుత్వ బీమా పొందుతున్నారు. తద్వారా దేశంలోనే అత్యధిక బీమా పొందుతున్న రాష్ట్రంగా తెలంగాణ నిలుస్తున్నది.

అయితే, 2023 అసెంబ్లీ ఎన్నికలు రాష్ట్రంలో కీలకం కానున్నాయి. కాంగ్రెస్ పార్టీ తప్పుడు హామీలతో ప్రజలను మాయచేయాలని యత్నిస్తున్నది. ఇదే సమయంలో బీఆర్‌ఎస్ పార్టీ తమ మ్యానిఫెస్టోను విడుదల చేసింది. అందులో ప్రధానాంశం 'కేసీఆర్ బీమా-ప్రతి ఇంటికి ధీమా' అనే పథకం. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో భాగమైన యూనివర్సల్ హెల్త్ కేర్‌ను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఈ పథకాన్ని రూపొందించింది.

> అభివృద్ధి చెందిన దేశంలో వలె ప్రతి వ్యక్తికి బీమా సౌకర్యం కల్పించే లక్ష్యంతో బీఆర్‌ఎస్ ఈ పథకానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగానే రాష్ట్రంలో ఉన్న 93 లక్షల బీపీఎల్ కుటుంబాలకు బీమా సౌకర్యం కల్పించనున్నది. ఇది చాలా గొప్ప నిర్ణయం.

గత పదేండ్లలో అభివృద్ధి సూచిలోని అనేక అంశాలలో తెలంగాణ ప్రభుత్వం ఘన విజయం సాధించింది. శిశు మరణాల రేటు తగ్గించడం నుంచి తాగునీరు అందించేవరకు తెలంగాణ ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలుచేస్తున్నది. దీనిద్వారా ఇటీవల విడుదల చేసిన పేదరిక సూచిలో తెలంగాణలో పేదరికం భారీగా తగ్గినట్టు తేల్చారు. 2015-16లో 13.8 శాతం ఉన్న పేదరికం 2019-21లో 5 శాతానికి తగ్గడం అభినందనీయం.

కేసీఆర్ బీమా పథకం దేశంలోనే భారీ బీమా పథకంగా నిలువనున్నది. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని అత్యధిక శాతం ప్రజలకు బీమా సౌకర్యం కలుగనున్నది. భారీ ప్రాజెక్టు, మౌలిక సదుపాయాలతో దేశంలోనే రోల్‌మాడల్‌గా సాగిన రాష్ట్రం తెలంగాణ. ఇకముందు సమ్మిళిత అభివృద్ధితో, ప్రజా సంక్షేమంతో 'తెలంగాణ ప్రభుత్వం 3.0'గా అవతరించనున్నది. అందుకే ప్రతి పౌరుడు తమ ఊరిలోని రచ్చబండ వద్ద ఈ పథకం పట్ల సమగ్రంగా చర్చించాలి. పథకం ఆవశ్యకతను తెలుసుకున్నపుడే ప్రభుత్వం విలువ తెలుస్తుంది. ఆ దిశగా అడుగులు పడాలని ఆశిద్దాం.